సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం । 8 । ఏప్రిల్ । 2023



అందరికీ ఆరోగ్యం
అందరికీ ఆరోగ్యం.. అదే ప్రభుత్వ నినాదమని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఏసీ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. 10లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,310
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,566
3 శాతం జీఎస్టీతో	రూ.5,732
నవర (8 గ్రా)	రూ.45,856

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.5 /26.9
శుక్రవారం గాలిలో 62 శాతం తేమ ఉంది. శనివారం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.





ఉత్సవం: నెల్లూరు మూలాపేటలో వేణుగోపాలస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని రథం లాగారు.



ప్రతి ఇంటికీ: వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. ఇందులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు.



భక్తి: గుడ్ ఫ్రైడే సందర్భంగా నెల్లూరులోని కపాడిపాళెం సెయింట్ జోసఫ్స్ ఆర్సీఎం చర్చిలో శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు. శిలువ మోసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

న్యూస్‌రీల్

98.58 శాతం మందికి పింఛన్ల పంపిణీ



కోవూరు మండలం వేగూరుకు చెందిన మస్తానమ్మ బయోమెట్రిక్ తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్యలక్ష్మి

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 3,07,447 మంది లబ్ధిదారులకు గానూ 3,03,080 మందికి నగదు అందజేశారు. దీంతో 98.58 శాతం నమోదైంది.

ఉదయగిరి నేతలతో రాజమోహన్‌రెడ్డి సమావేశం



రాజమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి శుక్రవారం నెల్లూరులోని తన నివాసంలో ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన వివిధ మండలాల వైఎస్సార్‌సీపీ నేతలతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పలు విషయాలపై మేకపాటి చర్చించారు. వచ్చే ఎన్నికల్లో ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించేందుకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని వారితో చెప్పారు. తన తమ్ముడు చంద్రశేఖర్‌రెడ్డి వ్యవహరించిన తీరుతో ఎంతో కలత చెందానన్నారు. తాను శాయశక్తులా ప్రయత్నం చేసినప్పటికీ చంద్రశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ విషయంలో తప్పు చేసినట్లు చెప్పారు. పార్టీ తీసుకున్న నిర్ణయం సరైనదేనన్నారు. అనంతరం మండలాల వారీగా పలు అంశాల గురించి చర్చించారు.

కామాక్షితాయికి బంగారు నెక్లెస్ బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి దాతలు తెల్లరాయిలు కలిగిన బంగారు నెక్లెస్‌ను శుక్రవారం బహూకరించారు. దామరమడుగుకు చెందిన సీహెచ్ శ్రీధర్‌రెడ్డి, మాధవి దంపతులు సుమారు 16 గ్రాములు బరువు కలిగిన బంగారు నెక్లెస్‌ను బహూకరించారని ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

మళ్లీ కరోనా కేసులు?



నెల్లూరు(అర్బన్): జిల్లాలో శుక్రవారం నలుగురు వ్యక్తులు కరోనా బారిన పడినట్లు తెలిసింది. ఈ విషయం ప్రజల్లో కలకలం రేపింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ పెంచలయ్య మాట్లాడుతూ కోవిడ్ కేసులు గురించి తమ దృష్టికి ఇంకా రాలేదన్నారు. కోవిడ్ కేసులు పెరిగితే అడ్మిషన్లు చేసుకునేందుకు ఆక్సిజన్ సిలిండర్లు, బెడ్లు, ఇతర వసతులు సిద్ధం చేసుకుంటామన్నారు.

అబద్ధాల ‘బాబు’

అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబుకు మించిన వారు లేరు. చేయని పనిని చేసినట్లుగా చెప్పడం ఆయన నైజం. ఇది మరోసారి నిరూపితమైంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరులో కట్టిన టిడ్కో ఇళ్లంటూ బాబు సెల్ఫీ దిగారు. అయితే ఆ ఇళ్లను అసంపూర్తిగా వదిలేసిన ఘనత గత ప్రభుత్వానిది. నిజం ఏంటంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గృహాలను లబ్ధిదారులకు అందించింది. ఇంకా వేలాదిమంది మహిళలకు పట్టాలిచ్చి గృహాలు కట్టిస్తోంది.

- టిడ్కో ఇళ్ల వద్ద చంద్రబాబు సెల్ఫీ
- టీడీపీ హయాంలో అసంపూర్తిగా టిడ్కో గృహాలు
- పూర్తి చేసి లబ్ధిదారులకు అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జగనన్న కాలనీల్లో వేగంగా వేలాది ఇళ్ల నిర్మాణాలు
- బాబు తీరుపై లబ్ధిదారుల మండిపాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇళ్ల నిర్మాణం విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చెబుతున్న మాటలు పూర్తిగా అసత్యాలు. వెంకటేశ్వరపురంలోని జనార్దనరెడ్డి కాలనీలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం వద్దకు శుక్రవారం ఆయన చేరుకుని సెల్ఫీ తీసుకున్నారు. ‘చూడు జగన్ మా ప్రభుత్వ హయాంలో పేదలకు కట్టిన వేలాది ఇళ్లు. ఈ నాలుగేళ్లలో నువ్వు కట్టిన ఇళ్లు ఎక్కడ? జవాబు చెప్పగలవా?’ అని ట్వీట్ చేశారు. అసలు విషయం తెలిసిన వారందరూ చంద్రబాబు అబద్ధాల కోరంటూ మండి పడుతున్నారు. వాస్తవానికి టీడీపీ హయాంలో జనార్దనరెడ్డి కాలనీలో టిడ్కో గృహ సముదాయంలో నాలుగు వేల ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఈ ప్రక్రియ ఆశించినంత వేగంగా జరగలేదు. ఇళ్లు అసంపూర్తిగా మిగిలిపోయాయి. 2019లో ఎన్నికల కోడ్ వచ్చింది. ఇళ్లు పూర్తి కాకపోయినా టీడీపీ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా హడావుడిగా కొందరు లబ్ధిదారులకు తాళాలు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. అయితే లబ్ధిదారులు స్పందించలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసింది. అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులకు అందజేసింది. ఇప్పటికే వేలాదిమంది ఈ గృహాల్లో నివాసం ఉంటున్నారు.

ఈ ప్రభుత్వం ఇల్లు ఇచ్చింది



టీడీపీ హయాంలో జనార్దనరెడ్డి కాలనీలో నాకు టిడ్కో ఇల్లు మంజూరైంది. అయితే నిర్మాణ పనులు అప్పుడు పూర్తికాకపోవడంతో ఇవ్వలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. ఒక్క రూపాయితో రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు.

– జోత్స్న, టిడ్కో ఇల్లు లబ్ధిదారు



బుచ్చిరెడ్డిపాళెం: కట్టుబడిపాళెంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ఒక్క రూపాయితో రిజిస్ట్రేషన్

టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్లు ఇస్తామని చెప్పిన అప్పటి పాలకులు పేదల నెత్తిన అప్పుల భారాన్ని మోపారు. సింగిల్, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చేందుకు డిపాజిట్ రూపంలో నగదు వసూలు చేశారు. అంతేకాక బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించి లబ్ధిదారులు నెల వాయిదాలు చెల్లించాలన్న నిబంధన పెట్టారు. సింగిల్ బెడ్‌రూం ఇల్లు పొందిన లబ్ధిదారు క్రమం తప్పకుండా 20 సంవత్సరాలపాటు నెలకు రూ.3,500 చొప్పున చెల్లించేలా ఒప్పంద పత్రాలను తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సింగిల్ బెడ్‌రూం లబ్ధిదారుల నుంచి ఎటువంటి డిపాజిట్ రుసుం వసూలు చేయకుండా రూ.1కే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది. అదేవిధంగా అప్పట్లో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల నుంచి కట్టించుకున్న డిపాజిట్లలో నేటి ప్రభుత్వం 50 శాతం మినహాయింపు ఇచ్చింది.

నేడు అక్కడే ఏడు వేలకు పైగా..

టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనుల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చాయి. నాడు 4 వేల ఇళ్లను అసంపూర్తిగా వదిలేయగా.. నేటి ప్రభుత్వం వాటిని పూర్తి చేసింది. అంతేకాకుండా అదే జనార్దనరెడ్డి కాలనీలోనే జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి ఏడు వేలకు పైగా ఇళ్ల నిర్మాణం చేపట్టింది.



గుండ్లపాళెంలో ఇళ్ల నిర్మాణాలు

సొంతింటి కల సాకారం చేసేందుకు..

నెల్లూరు(అర్బన్): టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నిలువ నీడ లేని నిరుపేదలు వేలాది మంది తమకు ఇంటి స్థలం మంజూరు చేయాలని అర్జీలు ఇచ్చినా స్పందించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక జిల్లాలో 494 జగనన్న కాలనీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటిలో 56,734 మందికి స్థలాలు మంజూరు చేసింది. ఇళ్లు కూడా తామే కట్టిస్తామని చెప్పింది. ఇందుకోసం రూ.1,200 కోట్లను జిల్లాలోనే ఖర్చు చేస్తోంది. కేవలం స్థలాలను ఇవ్వడమే కాకుండా ఆ కాలనీలో తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటికే సుమారు పది వేల ఇళ్లకు పైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. పలుచోట్ల పేదలు ఇళ్లలో చేరి ఆనందంగా ఉంటున్నారు. రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల విలువైన ఆస్తి ఒక్కో లబ్ధిదారు సొంతం కానుంది. ఈ ఇంటికి రిజిస్ట్రేషన్ చేస్తున్నందున వారి భవిష్యత్ అవసరాలకు విక్రయించుకోవచ్చు. రిజిస్ట్రేషన్ వల్ల విలువ పెరుగుతుంది. కాగా ఏప్రిల్ 15వ తేదీ నాటికి 16 వేల గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సొంత స్థలం ఉన్న వారికి మాత్రమే ఇళ్లను మంజూరు చేశారు. అవి మంజూరు కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్స్ తప్పనిసరి. సభ్యులకు లంచాలు ఇచ్చుకోవాల్సిందే. అసలు వాస్తవాలు ఇవైతే ప్రచార ఆర్భాటంతో చంద్రబాబు ఇప్పుడు ఇళ్ల పేరుతో డ్రామా ఆడుతున్నారని లబ్ధిదారులు మండి పడుతున్నారు.

204 మొబైల్స్ రికవరీ

- సత్ఫలితాలిస్తోన్న ‘మొబైల్ హంట్’
- ఎస్పీ విజయారావు వెల్లడి

నెల్లూరు సిటీ: రూ.45 లక్షల విలువ చేసే 204 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ విజయారావు తెలిపారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో శుక్రవారం ఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేస్తూ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి అందించాలని సంకల్పంతో మొబైల్ హంట్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా కేవలం వాట్సాప్ మెసేజ్ ద్వారా జిల్లా పరిధిలో చోరీ అయిన సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇస్తున్నట్లు చెప్పారు. అతి తక్కువ కాలంలో ఫోన్లను సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం రికవరీ చేసినట్లు తెలిపారు. మిగిలిన ఫోన్లను కూడా త్వరలో రికవరీ చేసి బాధితులకు అందిస్తామన్నారు. మొబైల్ హంట్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఎవరైనా ఈ అవకాశాన్ని తప్పుడు పద్ధతిలో వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఫోన్ అందజేస్తున్న పోలీస్ అధికారులు

వివరాలు పంపాలిలా..

- మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ముందుగా 91543 05600 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఒక మెసేజ్ పంపాలి.
- సదరు వ్యక్తికి వివరాల కోసం లింక్ వస్తుంది. దానిపై క్లిక్ చేస్తే గూగుల్ ఫారం ఓపెన్ అవుతుంది. వివరాలు పూర్తిగా నమోదు చేయాలి. వెంటనే ఫిర్యాదు నమోదవుతుంది.
- వివరాల ఆధారంగా మొబైల్‌ను గుర్తిస్తారు. దొరికిన వెంటనే సదరు వ్యక్తికి అందిస్తారు.

చక్రధర్‌బాబు రిలీవ్

నెల్లూరు(అర్బన్): కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ఏపీ జెన్‌కో ఎండీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన శుక్రవారం ఉదయం బాధ్యతలను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు అప్పగించి రిలీవ్ అయ్యారు. ఆయన విజయవాడ బయలుదేరి వెళ్లారు. కాగా ఆదివారం చక్రధర్‌బాబును అధికారులు నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో సన్మానించనున్నారు. నూతన కలెక్టర్ హరినారాయణ్ సోమవారం నెల్లూరుకు వచ్చే అవకాశముంది.

సోమశిలలో 53.445 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 53.445 టీఎంసీలున్నాయి. పైతట్టు ప్రాంతాల నుంచి 368 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పెన్నార్‌డెల్టాకు 1,200, ఉత్తరకాలువకు 403, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 325 క్యూసెక్కుల నీరు ఆవిరవుతోంది.

సీఎం వైఎస్ జగన్‌కే ప్రజల మద్దతు



‘జగనన్నే మా భవిష్యత్తు’ కరపత్రం అందజేస్తున్న మంత్రి కాకాణి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సంక్షేమ పథకాలతో అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజల మద్దతు ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కాకాణి ప్రారంభించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. వైఎస్ జగన్ పాలనపై ప్రజలను పలు ప్రశ్నలు అడిగి.. విశ్వసిస్తున్నామని చెప్పడంతో రసీదు ఇచ్చి ఇంటికి, సెల్‌ఫోన్‌కు స్టిక్కర్లు అతికించారు. అనంతరం ప్రజలు జగనన్నకు మద్దతు తెలిపేందుకు 82960 82960 ఫోన్ నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇప్పించారు.

ప్రతిష్టాత్మక కార్యక్రమం

ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా వైఎస్సార్‌సీపీకి ఏడు లక్షల మంది సైనికులు ఉన్నారన్నారు. 14 రోజుల్లో 1.60 కోట్ల కుటుంబాల్లోని 5 కోట్ల మంది ప్రజలను కలిసే జగనన్నే మా భవిష్యత్తు అనే అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని తెలియజేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అన్నీ గ్రామాల్లో తిరిగి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు అందరూ సమన్వయంతో ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో చేసిన తప్పిదాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. జగనన్న పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉంటేనే విశ్వసిస్తున్నట్లు రసీదు ఇస్తారని చెప్పారు. అలాగే ఇష్టం ఉంటేనే జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్‌ను ఇంటికి, సెల్‌ఫోన్లకు అతికిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకుల పెత్తనంతో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమయ్యారని, నేడు సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. అలాగే నాయకులు, ఇతరుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వడ్డిపాళెంలో సీసీరోడ్లు, సైడు కాలువలు, శ్మశానవాటికల అభివృద్ధి తదితర పనులు చేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి మందల వెంకటశేషయ్య, మండల వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, నాయకులు కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఈపూరు రజినీకాంత్‌రెడ్డి, కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, వెలిబోయిన వెంకటేశ్వర్లు, నాటకం శ్రీనివాసులు, చీకుర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతా గందరగోళం

- టీడీపీలో బయటపడిన విభేదాలు
- కన్నబాబుపై కొమ్మి ఆగ్రహం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు ఇస్తే పంచలేదని ఆరోపణ

నెల్లూరు(టౌన్): జిల్లాలో నిర్వహించిన టీడీపీ అంతర్గత సమావేశంలో గందరగోళం నెలకొంది. సమావేశంలో నేతల మధ్య విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. ఈ ఘటన ఉదయమే చోటు చేసుకోవడంతో ఏ పరిస్థితికి దారి తీస్తుందోనని నేతలు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం నెల్లూరులోని ఎస్వీజీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో జోన్–4కు సంబంధించి ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాల టీడీపీ క్లస్టర్, యూనిట్, మండల పార్టీ నాయకులతో అంతర్గత సమావేశం నిర్వహించారు. దీనికి ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు వచ్చారు. అయితే ఆయన అనుచరులకు అనుమతి లేదని రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో ఉండే వారు నిలిపివేశారు. దీంతో కోపోద్రిక్తుడైన కొమ్మి ఆత్మకూరు టీడీపీకి చెందిన కన్నబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మా అనుచరులకు అనుమతి లేకుండా వేరే వాళ్లను ఎలా పంపిస్తారని వాగ్వాదానికి దిగారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు డబ్బులు పంచాలని కన్నబాబుకు ఇస్తే.. ఎక్కడా పంచకుండా దాచుకున్నాడని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఉండి వ్యాపారాలు చేసుకుంటూ నెలకో, రెండు నెలలకో ఆత్మకూరుకు వచ్చే కన్నబాబుకు ఏ విధంగా ప్రాధాన్యం ఇస్తారని దుర్భాషలాడారు. దీంతో కన్నబాబు అనుచరులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో నాయకులు ఇరువర్గాలకు సర్ది చెప్పి పంపించారు. దీంతో అసంతృప్తికి లోనైన కొమ్మి సమావేశానికి చంద్రబాబు వచ్చిన తర్వాత కనిపించలేదు. ఇంకా భోజనాల దగ్గర మీడియా ప్రతినిధులు, టీడీపీ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు తోసుకునే వరకు వెళ్లింది. ఇంకా నెల్లూరు నగరం నుంచి రానున్న ఎన్నికల్లో తానే పోటీ చేస్తానని ప్రచారం చేసుకుంటున్న మాజీ మంత్రి నారాయణ ముఖ్యమైన సమావేశానికి హాజరుకాకపోవడాన్ని ఆ పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జి నుంచి ప్రతిస్పందన కరువైంది.

ప్రతి ఇంటికీ పలకరింపు



సర్వే వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గంలోని ప్రతి ఇంటినీ పలకరించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడమే లక్ష్యంగా 14 రోజుల పాటు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలిలోని తన నివాసం నుంచే శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని వివరించారు. ఐదు ప్రశ్నలతో కూడిన 'పీపుల్స్ సర్వే' నిర్వహించి వివరాలను 'ప్రజా మద్దతు' పుస్తకంలో నమోదు చేయించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను ఇంటి సింహద్వారానికి అతికించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి బైక్‌లపై ర్యాలీగా పదో వార్డుకు చేరుకున్నారు. స్థానికంగా ఇంటింటికీ తిరిగి గత 46 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఐదు ప్రశ్నలతో సర్వే నిర్వహించి లబ్ధిదారుల అభిప్రాయాన్ని ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేయించారు. లబ్ధిదారుల అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇంటి తలుపులకు అతికించారు.

జగనన్న పాలనలో ఉజ్వల భవిష్యత్తు



'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తదితరులు

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మళ్లీ రావాలని, అందుకోసం ప్రతి ఒక్కరం సమష్టిగా పనిచేద్దామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మాముడూరు గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు సింగసాని గురుమోహన్, ప్రజాప్రతినిధులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.2 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు అందజేసి వారి కళ్లల్లో ఆనందాన్ని నింపారని తెలిపారు. ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ ఆశీర్వదించాలని కోరారు.

బాధితుల అకౌంట్లలోకి రూ.45 లక్షల జమ

• ఎస్పీ విజయారావు

నెల్లూరు సిటీ: సైబర్ మోసాల్లో తమ నగదును పోగొట్టుకున్న 788 మంది బాధితులకు తిరిగి వారి ఖాతాల్లోకి రూ.45 లక్షలు జమ చేసినట్లు ఎస్పీ సీహెచ్ విజయారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ బయోమెట్రిక్‌ను దుర్వినియోగం చేస్తూ కొత్తరకం సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేరాల ఛేదనలో బ్యాంకు అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్ మోసాలు జరిగిన 24 గంటల్లో పోలీస్‌స్టేషన్, సైబర్ క్రైం పోర్టల్, 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయడం ద్వారా రూ.86 లక్షలు ఉన్న బాధితుల బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు. ఆధార్ బయోమెట్రిక్ లాక్ చేసుకోవడం ద్వారా దుర్వినియోగాన్ని కొంతవరకు నిరోధించవచ్చన్నారు. రూ.10 లక్షలు మోసపోయిన బాధితుడికి తిరిగి అందించిన సైబర్ క్రైమ్ పనితీరు హర్షణీయమన్నారు. గ్రామాల్లో మహిళా పోలీసులు సైబర్ క్రైంపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

సంక్షేమంలో అర్హతే ప్రామాణికం



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

ఉలవపాడు: సంక్షేమ పథకాల అమలులో అర్హతే ప్రామాణికం అని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని భీమవరం–2 సచివాలయ పరిధిలోని ఎల్.రాజుపాళెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో కొందరు తమకు ఇళ్ల స్థలాలు కావాలని కోరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. 'వారం రోజుల్లో రెవెన్యూశాఖ అధికారులు మీ ఇంటికి వచ్చి పరిశీలిస్తారని' తెలిపారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



'మా నమ్మకం నువ్వే జగన్' కిట్లు అందజేస్తున్న చిరంజీవిరెడ్డి

కలిగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయ పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగిస్తున్నారని ఏపీ స్టేట్ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గృహసారథులకు 'మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివరించేందుకు ధైర్యంగా ప్రజల్లోకి వెళుతున్నట్లు తెలిపారు. 2024లో జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష, ఎంపీటీసీ సభ్యులు హరిశ్చంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణయ్య, రాగయ్య, దొరసానమ్మ, సర్పంచ్‌లు మల్లికార్జున్‌రెడ్డి, సుబ్బానాయుడు, వెంకటసుబ్బయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం.. అదే ప్రభుత్వ నినాదం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, పీఎంపీ అసోసియేషన్, వాకర్స్ సంఘాల కార్యకర్తలు

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య
• పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఏసీ స్టేడియం వరకు భారీ ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అందరికీ ఆరోగ్యం.. అదే ప్రభుత్వ నినాదమని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఏసీ స్టేడియం వరకు వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది, పీఎంపీ అసోసియేషన్, వాకర్స్ సంఘాల కార్యకర్తలు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏసీ స్టేడియంలో జరిగిన సభలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 'అందరికీ ఆరోగ్యం' అనే నినాదం ఇచ్చిందని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాఖకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు సమకాలీన ఆరోగ్య అంశాలపై ప్రజలను చైతన్యవంతులను చేస్తూ వారి ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నామన్నారు. అలాగే ప్రజలు కూడా వాతావరణ, ప్లాస్టిక్ కాలుష్యం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కలుషితం లేని ఆహారం తీసుకోవాలని, ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన పరికరాలు, మందులతోపాటు సిబ్బంది పుష్కలంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు చందన, సృజన, డెమో అధికారి శ్రీనివాసరావు, పలు కళాశాలల నర్సింగ్ విద్యార్థులు, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నాయకులు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

గుడ్లూరు: ప్రమాదవశాత్తు కాలుజారి చింతకుంట చెరువులో పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని తెట్టు గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు కావలిలోని గుండుబావి వీధికి చెందిన షేక్ అబ్దుల్‌సలాం పెద్దకుమారుడు మహమ్మద్‌అలీ(22) మండలంలోని తెట్టు గ్రామంలో నివాసం ఉంటున్న తాత సుల్తాన్‌బాషా, అమ్మమ్మ నూర్జహాన్ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి ఇంటి వద్ద భోజనం చేసి బయటకు వెళ్లి వస్తానని తాతయ్య, అమ్మమ్మలకు చెప్పి వెళ్లాడు. ఆ రాత్రి ఇంటికి రాకపోయేసరికి తల్లిదండ్రుల వద్దకో, స్నేహితుల వద్దకో వెళ్లి ఉంటాడని వారు అనుకున్నారు. రెండో రోజు విచారించగా మహమ్మద్‌అలీ వారి వద్దకు వెళ్లలేదని తెలుసుకున్న సుల్తాన్‌బాషా బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఎస్టీకాలనీకి సమీపంలో ఉన్న చింతగుంట చెరువులో మృతదేహం ఉందని కాలనీవాసులు గ్రామస్తులకు తెలిపారు. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రసాదరెడ్డి చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. విషయం తెలుసుకున్న సుల్తాన్‌బాషా ఘటనా స్థలం వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి తన మనువడు మహమ్మద్‌అలీ అని గుర్తించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. సుల్తాన్‌బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉండవచ్చని లేదా మరే ఇతర కారణాలతో అయినా చనిపోయి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న షేక్ ఆరీఫ్

కావలిరూరల్: ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి మద్దూరుపాడు జాతీయ రహదారి వద్ద జరిగింది. కావలి రూరల్ ఎస్సై ఎం.వెంకట్రావు సమాచారం మేరకు.. ఉలవపాడు మండలం తెట్టుకు చెందిన షేక్ ఆరీఫ్ కావలిలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకుని తెట్టుకు బైక్‌పై వెళ్తుండగా మద్దూరుపాడు వద్ద ముందువెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో షేక్ ఆరీఫ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం హైవే అంబులెన్స్ సిబ్బంది కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని విద్యార్థికి గాయాలు



ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో చికిత్సపొందుతున్న వెంకటేష్

అనుమసముద్రంపేట: కారు ఢీకొని ఓ విద్యార్థి గాయపడిన ఘటన మండలంలోని సంపత్ నగర్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ వివరాల మేరకు చౌటభీమవరం పంచాయతీలోని సంపత్‌నగర్‌కు చెందిన వెంకటేష్ రాజవోలులోని ప్రాథమికోన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం ఇంటికి వెళ్లేందుకు ఆటో దిగి రోడ్డు దాటుతుండగా ఆత్మకూరు నుంచి వింజమూరు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో వెంకటేష్‌కు కాలు విరిగింది. కాగా కారు డ్రైవర్ వాహనాన్ని ఆపినట్టే ఆపి అక్కడి నుంచి ఉడాయించాడు. స్థానికులు ఈ విషయాన్ని ఏఎస్‌పేట ఎస్సై నరేష్‌కు సమాచారం అందించడంతో ఆయన వెంటనే వింజమూరు, దుత్తలూరు పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. కారు నంబర్‌ను ట్రేస్ చేసి వింజమూరు పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

వందేభారత్‌కు చార్జీల ఖరారు

నెల్లూరు(సెంట్రల్): ప్రయాణికులకు ఈ నెల 9వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్న సికింద్రాబాద్ – తిరుపతి, తిరుపతి – సికింద్రాబాద్ వందేభారత్ రైలుకు రైల్వేశాఖ రెండు విభాగాలుగా చార్జీలను ఖరారు చేసింది.

	చైర్‌కార్	ప్రత్యేక చైర్‌కార్
నెల్లూరు – ఒంగోలు	రూ.525	రూ.1,005
నెల్లూరు – గుంటూరు	రూ.750	రూ.1,460
నెల్లూరు – సికింద్రాబాద్	రూ.1,435	రూ.2,645
నెల్లూరు – తిరుపతి	రూ.710	రూ.1,195

గాయపడిన వ్యక్తి మృతి

ఉలవపాడు: జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. భీమవరం అడ్డరోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న చినపవనికి చెందిన మండవ శ్రీనివాసరావును బొలేరో వాహనం ఢీకొన్న విషయం తెలిసిందే. 108లో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో చేరి తరువాత మరో వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్లోంచి జారిపడిన కూలీ

• నిలిచిన పినాకిని ఎక్స్‌ప్రెస్



నిలిచిపోయిన పినాకిని ఎక్స్‌ప్రెస్

మనుబోలు: మండలంలోని జట్లకొండూరు సమీపంలో విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో నుంచి శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఓ వ్యక్తి జారిపడడంతో రైలు ఆగిపోయింది. వివరాలు.. చెరుకు నరికే పని కోసం అన్నవరం నుంచి 10 మంది కూలీలు గూడూరుకు పినాకిని రైల్లో వస్తున్నారు. రైలు జట్లకొండూరు సమీపంలో వెళుతుండగా కూలీల్లోని సుందరరావు వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీనిని వెంటనే గమనించిన తోటి కూలీలు చైన్ లాగి రైలును ఆపేశారు. సుందరరావు తలకు తీవ్రగాయాలు కాగా చికిత్సనిమిత్తం నెల్లూరుకు తరలించారు. పొట్టకూటి కోసం తమతో వచ్చిన సుందరరావు తీవ్రంగా గాయపడడంతో తోటి కూలీలు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రైల్వే సిబ్బంది అధికారులకు సమాచారం అందించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 95
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 172
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 192
లేయర్ చికెన్	: 128

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి: రూ. 67
సన్నవి: రూ. 55
పండ్లు: రూ. 30

